# మ్యానిఫెస్టోపై అందరి హర్షం

## సీఎం కేసీఆర్ తమ గురించి ఆలోచన చేశారన్న ప్రజలు

*సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులకు, ఆసరా పింఛన్లు, రైతుబంధు పెట్టుబడిసాయం, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.3వేలు భృతి, కేసీఆర్ బీమా తదితరాలను పూర్తిగా స్వాగతిస్తున్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మ్యానిఫెస్టో ప్రకటించారని, తమ గురించి గింత మంచి ఆలోచన చేసినందుకు రుణపడి ఉంటామని అంటున్నారు.*

### దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు



పరకాల : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ అయిన తర్వాత దివ్యాంగుల జీవితాల్లో నిండాయి. దివ్యాంగులకు పెన్షన్ ఇప్పటికే దేశంలోనే అత్యధికంగా ఇస్తున్నారు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం రూ.3,016 నుంచి రూ.4016కు పెంచింది. మళ్లీ అధికారంలోకి వస్తే విడుతల వారీగా రూ.6వేలకు పెంచుతామంటూ బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షనీయం. దివ్యాంగులను పట్టించుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే. రానున్న రోజుల్లోనూ దివ్యాంగులకు అండగా నిలిచేది సీఎం కేసీఆర్ మాత్రమే. సీఎం కేసీఆర్ అన్నది తప్పకుండా చేసి చూపిస్తాడు.

*– లాసాని నర్సింగరావు, దివ్యాంగులహక్కుల జాతీయ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్*

### పేదలకు సన్నబియ్యం గొప్ప నిర్ణయం



ఎల్కతుర్తి: నిరుపేదలు రేషన్ బియ్యంతో భోజనం చేసి బతుకుతున్నారు. కూలి నాలి చేసుకునే వారు సన్నబియ్యం తినాలంటే ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉంటది. సీఎం కేసీఆర్ పేదల బతుకులు ఆలోచించే వ్యక్తి. ఇప్పుడు నెలకు 6కిలోల చొప్పున కుటుంబంలో అందరికీ రేషన్ షాపుల ద్వారా ఉచితంగానే బియ్యాన్ని ఇస్తున్నారు. కొందరు ఉన్న వారు మాత్రమే సన్నబియ్యంతో తిండి తింటున్నారు. సీఎం కేసీఆర్ ఇప్పుడు అన్నపూర్ణ పథకంలో పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. ఎంతోమంది పేదవాళ్లకు కడుపునిండా తిండి దొరుకుతుంది. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ మళ్లీ రావాలి.

*– యాళ్ల మోహన్‌రెడ్డి, పెంచికల్‌పేట, ఎల్కతుర్తి మండలం*

### అన్ని వర్గాల సంతృప్తి



వేలేరు: సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో పథకాలపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుబీమా పథకంలా సుమారు 93లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా సౌకర్యం కల్పించడం హర్షణీయం. గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుబీమా అమలయ్యేది. 59 ఏండ్లలోపు ఉన్న రైతులు చనిపోతే వారికి రూ.5లక్షల బీమా డబ్బులు అందేవి. కానీ కేసీఆర్ బీమా సౌకర్యంతో రేషన్‌కార్డు ఉన్న వ్యక్తి ఏ కారణంతో చనిపోయినా రూ.5లక్షల బీమా పొందే అవకాశం కల్పించడం గొప్ప విషయం.

*– కొయ్యడ మహేందర్, పీచర గ్రామం*

### వృద్ధులకు, దివ్యాంగులకు భరోసా



హనుమకొండ చౌరస్తా : దేశంలో సీఎం కేసీఆర్ ఎక్కడా లేనివిధంగా సుపరిపాలన అందిస్తున్నారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను కూడా ఆచరణలోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. వృద్ధులకు, దివ్యాంగులకు భరోసా కల్పించే మ్యానిఫెస్టో రూపొందించారు.

*– వీర రఘువీర్, పెద్దమ్మగడ్డ*

### చెప్పింది చేసే సీఎం కేసీఆర్



కాజీపేట: సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన రైతు బంధు పథకం రైతును మరింత ఆదుకునేలా ఉంది. మాటలు చెప్పడం కాదు.. ఆచరణలో పెట్టడం ఆయనకే సాధ్యం. మ్యానిఫెస్టోలో ప్రకటించిన వరాలు, ప్రకటించని వాటిని కూడా చేసి చూపారు. రైతుకు రైతుబంధు కింద రూ.16వేల పెట్టుబడి సాయం అందించనుండడం బాగుంటుంది. కేసీఆర్ పాలనలో రైతులకు సరైన న్యాయం జరుగుతుంది.

*– సుంచు అశోక్, రైతు సోమిడి, కాజీపేట*

### పేదల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్



వరంగల్: పేదల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో అద్భుతంగా ఉంది. కేసీఆర్ బీమాతో పేదలకు బతుకు భరోసా కలుగుతుంది. పేదల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్. అందుకే మ్యానిఫెస్టో జనమోదం పొందేలా ఉంది. సీఎం కేసీఆర్ పేదలను ఆర్థికంగా మరింత ఆదుకోవాలని మ్యానిఫెస్టో ప్రకటించారు.

*– మాలకుమ్మరి పరుశరాములు, వ్యాపారి*

### రైతుల గురించి ఆలోచించే ఏకైక సీఎం



ఆత్మకూరు: రైతుల గురించి ఆలోచించే ఏకైక సీఎం కేసీఆర్. ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టోలో రైతుబంధు పథకం కింద ఏడాదికి రూ.16వేలు పెట్టుబడి సాయం అందిస్తానని ప్రకటించడంపై రైతులందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చాలని లక్ష్యంతో నూతనమైన పథకాలను ప్రవేశపెడుతున్నాడన్నారు.దేశంలో ఏరాష్ట్రంలోని పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

*– గ్యాదర్ల శ్రీనివాస్, రైతు, ఆత్మకూరు*

### రైతుకు ఆత్మబంధువు కేసీఆర్



నడికూడ: తెలంగాణ వచ్చినంక రైతుల బాధలు తప్పినయి. సీఎం సారు మాకు రైతుబంధు ఇస్తాండు. రైతు బీమా చేసిండు. వ్యవసాయానికి పుష్కలంగా నీళ్లు వచ్చేలా చేసిండు. కరెంట్ 24గంటలు ఫ్రీగా ఇస్తాండు. ఎకరానికి ఇంత పెట్టుబడి ఇయ్యాలన్న సోయి నాడు ఏ నాయకునికీ పట్టలేదు. కేసీఆర్ సారు ప్రభుత్వం వచ్చినంక రైతులకు పంట ఎకరానికి రూ.10వేలు ఇచ్చిండు. ఇప్పుడు పెరిగిన ఖర్చులను చూసి ఏడాదికి రూ.16వేలు చేస్తా అని చెప్పిండు. రైతుల గురించి ఇంతగా ఆలోచించిన నాయకుడిని ఇంతవరకు చూడలె.

*– తాళ్ల రవి, నడికూడ రైతు*

### కేసీఆర్ సారే మళ్లా సీఎం కావాలె



హనుమకొండ: కేసీఆర్ సారే మళ్లీ సీఎం అయితే మాలాంటి పేదోళ్లకు న్యాయం జరుగుతది. నేను వితంతు రాలిని. నాకు ఇప్పుడు రూ.2,016 పింఛన్ వత్తాంది. ఈ డబ్బులతోనే నాకు ఖర్చులు ఎల్లుతున్నాయి. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు మా లాంటి నిరుపేదలు ఇబ్బందులు పడేవారు. సీఎం కేసీఆర్ పింఛన్‌ను రూ.5వేల ఇస్తానని అంటున్నాడు. అన్నది తప్పకుండా చేత్తాడు. గ్యాస్‌మొద్దు కూడా రూ.400కే ఇత్తడట. తెల్లరేషన్ కార్డు ఉన్నోళ్లకు సన్న బియ్యం ఇస్తానని అన్నడు. ఏ ప్రభుత్వం కేసీఆర్ సారు లెక్క ఆదుకోలె. మల్లా కేసీఆర్ సారే గెలవాలి. గప్పుడే మాలాంటి బీదలకు న్యాయం జరుతది.

*– ఎదులాపురం సమ్మక్క, మచిలీబజార్, హనుమకొండ*

### రైతులను ఆదుకున్న నాయకుడు



హసన్‌పర్తి : ఎన్నో ప్రభుత్వాలు మారినై కానీ ఎవరూ రైతులను పట్టించుకోలె. రాత్రి పూట కరెంటు పెట్టబోయి రైతులు కరెంటుతోటి, పాముకాటుతోటి ఎందరో చనిపోయిండ్లు. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ రైతులకు ఉచితంగా 24గంటల కరంటు ఇచ్చి, కాళేశ్వరం నుంచి నీళ్లను తెచ్చి చెరువులు నింపడంతో పంటలు బాగా పండుతానయ్. రైతుబంధుతో పెట్టుబడికి ఎకరాకు రూ.10వేలు ఇచ్చి ఆదుకున్నడు. మల్లా కేసీఆర్ గెలిస్తే ఎకరాకు రూ.16వేలు ఇస్తానన్నడు. ఇచ్చిన మాట తప్పే వ్యక్తి కాదు.

*– బుర్ర సారయ్య, రైతు మడిపల్లి, హసన్‌పర్తి మండలం*

### సీఎం కేసీఆర్ సార్‌తోనే రైతులకు మేలు



వర్ధన్నపేట: గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా రైతులకు మేలు చెయ్యలె. సీఎం కేసీఆర్ సార్ వచ్చినంక రైతులు బాధలు తీరినై. మా తండాలకు కూడా పుష్కలంగా నీళ్లు వచ్చినై. భూములు దున్నుకుంటాంటనే అప్పుల కోసం తిరిగేది. కేసీఆర్ సార్ రైతుబంధు ఇవ్వడం వల్ల ఎక్కడికి అప్పులకు తిరగాల్సిన పనిలేకుండా పోయింది. నాకు రైతుబంధు పైసలు ఫసల్‌కు రూ.20వేలు వత్తానై. మందులు, నాటు కూళ్లకు సరిపోతానై. వడ్లు, పత్తిని కూడా మంచి ధరకే అమ్ముకుంటానం. మా తండాల ముగ్గురికి రైతుబీమా వచ్చింది. ఇంకా ముందుకు రైతుబంధు పెంచుతమని కేసీఆర్ సార్ చెప్పిండు. దీనివల్ల మాకు ఇంకా మేలు జరుగుతది. కేసీఆర్ సార్‌కే రైతుల మద్దతు పూర్తిగా ఉంటది.

*– మాలోత్ యాకూబ్‌నాయక్, రైతు, డీసీతండా, వర్ధన్నపేట*

---

## నేటి నుంచి ఆర్ట్స్ కళాశాలకు సెలవులు

హనుమకొండ, అక్టోబర్ 18: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు గురువారం నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు తిరిగి 25వ తేదీ నుంచి కళాశాలకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

## పద్మాక్షి గుండంలో విగ్రహాల నిమజ్జనం నిషేధించాలి

హనుమకొండ, అక్టోబర్ 18: హనుమకొండ పద్మాక్షికాలనీలోని పద్మాక్షి గుండంలో దుర్గా మాత విగ్రహాల నిమజ్జనాలపై నిషేధం విధించాలని పౌర స్పందన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు కరేటి శంకర్ రావు, నల్లెల రాజయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పద్మాక్షి గుండంలో విగ్రహాలు వేయడంతో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండి డంపింగ్ యార్డులా తలపిస్తోందని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

## ఆటోడ్రైవర్ కుటుంబానికి చేయూత

న్యూ శాయంపేట, అక్టోబర్ 18: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆటోడ్రైవర్, రాజరాజేశ్వరీ ఆటో యూనియన్ సభ్యుడు గండ్రతి రాజు కుటుంబానికి తోటి ఆటోడ్రైవర్లు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి మాట్లాడారు. ఆటోడ్రైవర్ల నుంచి దాదాపు రూ.3వేలు సేకరించి మృతుడి కుటుంబానికి అందజేశారు. యూనియన్ ఉపాధ్యక్షుడు బొల్ల సునీల్, కోశాధికారి రాస మల్ల సురేశ్, లక్ష్మణ్, పున్నం చందర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లకు 'కోడ్' అడ్డంకి

వరంగల్, అక్టోబర్ 18: తెలంగాణలో ఆడబిడ్డల పండుగ సద్దుల బతుకమ్మ ఏర్పాట్లకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. గతంలో అంగరంగ వైభవంగా బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారికంగా బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లకు అడ్డుగా మారింది. సద్దుల బతుకమ్మ, రావణ వధ ఉత్సవాల ఏర్పాట్లపై కమిషనర్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఇప్పటివరకు ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని అధికారులు చెబుతున్నారు. సద్దుల బతుకమ్మకు మరో నాలుగు రోజులు మాత్రమే ఉంది. మహిళలు పెద్ద సంఖ్యలో చేరి ఆడుకునే సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో చీకట్లు ఉండకుండా లైటింగ్ మాత్రమే ఏర్పాట్లు చేయాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## కాజీపేటలో నేడు రైల్వే ఈసీసీఎస్ ఎన్నికలు

కాజీపేట, అక్టోబర్ 18 : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో గురువారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) డెలిగేట్ ఎన్నికలు జరుగనున్నాయి. కాజీపేటలో రైల్వే ఈసీసీఎస్ 11వ నియోజకవర్గంలో మొత్తం 2,629 మంది ఓటర్లు తమ హక్కును బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ ఎన్నికల్లో 13 డెలిగేట్స్ స్థానాల్లో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్‌ల నుంచి చేరో 13 మంది డెలిగేట్స్ ప్యానెల్, డీఎంఆర్‌కేఎస్ నుంచి జోనల్ నేత మోతీలాల్ ఆధ్వర్యంలో నలుగురు, మరో ఆరుగురు ఇండిపెండెట్లుగా 36మంది డెలిగేట్స్‌గా ఎన్నికల బరిలో ఉన్నారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సభ్యత్వ కార్మికులు 15వ తేదీ నుంచి బుధవారం సాయంత్రానికే పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. 11వ నియోజకవర్గంలో13 డెలిగేట్స్ స్థానాల్లో ఏడుగురు సభ్యులు ఏ ప్యానెల్‌తో గెలిస్తే ఆ ప్యానెల్ వాళ్లల్లో ఒక్కరు డైరెక్టర్‌గా ఎన్నుకోబడుతారు. కాజీపేట 11వ నియోజకవర్గంలోని 13 డెలిగేట్స్ స్థానాలకు ఓటు వేసేందుకు డీజిల్, ఈఎల్ఎస్, ఈఎల్ఎస్ (టీఆర్‌డీ), సీఅండ్ డబ్ల్యూ, రైల్వేస్టేషన్, ఇంజినీరింగ్ సెంట్రల్ కార్యాలయం, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, రైల్వే క్రూ ల్యాబీ కార్యాలయంలో మొత్తం 8 ఓటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలో జరిగిన ఈసీసీఎస్ ఎన్నికల కౌంటింగ్‌ను సికింద్రాబాద్ సౌత్ లాలాగూడ ఇనిస్టిట్యూట్‌లో ఈనెల 25న చేపడతారు. ఈ ఎన్నికల రిజల్ట్‌ను ఎన్నికల అధికారులు 29న సాయంత్రం అధికారికంగా వెల్లడిస్తారని రైల్వే కార్మిక వర్గాలు తెలిపారు.